


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
గురువారం
09-10-2025
పేజీలు: 02




# హౌస్ అరెస్టులు.. మీడియాపై ఆంక్షలు పెట్టడమేనా ఇందిరమ్మ పాలన అంటే

## హరీశ్ రావు

ఇందిరమ్మ పాలన అంటే హౌస్ అరెస్టులు, మీడియాపై ఆంక్షలు పెట్టడమా అని రేవంత్ రెడ్డి సర్కార్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి, పురుషులకు బస్ టికెట్ డబుల్ చేశారని విమర్శించారు. పండుగలంటూ అడ్డదిడ్డంగా డబుల్ చార్జీలు వసూలు చేశారంటూ ధ్వజమెత్తారు. ఆర్టీసీ బస్సు చార్జీలను పెంచితే ప్రజలు మెట్రో రైలు ఎక్కుతారని చూస్తున్నారా అని నిలదీశారు. చలో బస్ భవన్ కార్యక్రమంలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'బస్ చార్జీల పెంపుపై బస్సుల్లో బస్ భవన్‌కు వెళ్లి ఆర్టీసీ ఎండీకి పిటిషన్ ఇవ్వాలనుకున్నాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా శాంతియుతంగా కార్యక్రమం చేపట్టాం. ఇంతదానికే హౌస్ అరెస్టులు, అక్రమ అరెస్టులు చేయడం ఎందుకు అని ప్రశ్నించారు. తెల్లవారు జామునుంచే తమ నాయకులను ఎందుకు అరెస్టు చేస్తున్నారని నిలదీశారు. హౌస్ అరెస్టులు, అక్రమ అరెస్టులు రేవంత్ రెడ్డి నిరంకుశత్వానికి నిదర్శమని చెప్పారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన ఇలాంటి చర్యలు ఖండిస్తున్నాం. ఇందిరమ్మ పాలన అంటే హౌస్ అరెస్టులు.. మీడియాపై ఆంక్షలు పెట్టడమా అని ధ్వజమెత్తారు.

# తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ (టీఎస్ఈసీ) స్థానిక ఎన్నికల తొలి దశకు సంబంధించి మండల్ ప్రజా పరిషత్ టెరిటోరియల్ కాన్‌స్టిట్యూన్సీలు (ఎంపీటీసీలు), జిల్లా ప్రజా పరిషత్ టెరిటోరియల్ కాన్‌స్టిట్యూన్సీలు (జెడ్పీటీసీలు) ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇది రాష్ట్రంలో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియకు తొలి అడుగు. మొత్తం 31 జిల్లాల్లో 565 మండలాల్లో జరిగే ఈ ఎన్నికల్లో 5,749 ఎంపీటీసీ సీట్లు, 565 జెడ్పీటీసీ సీట్లకు ఎన్నికలు జరుగనున్నాయి. ఇందులో ములుగు జిల్లా మాంగపేట్ ఎంపీపీలోని 14 ఎంపీటీసీ సీట్లకు కోర్టు ఆదేశాల కారణంగా ఎన్నికలు జరగవు. మొత్తం 1.67 కోట్ల మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో పాల్గొంటారు. వీరిలో పురుషులు 81.65 లక్షలు, మహిళలు 85.36 లక్షలు, ఇతరులు 504 మంది ఉంటారు. తొలి దశకు సంబంధించి నోటిఫికేషన్ ఈ రోజు విడుదలైంది. నామినేషన్ల స్వీకరణ అక్టోబర్ 9 నుంచి 11 వరకు జరుగనుంది. రోజూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఉంటుంది. నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) అక్టోబర్ 12న జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణ (విత్‌డ్రాయల్) కోసం గడువు తేదీ అక్టోబర్ 15. తొలి దశకు ఎన్నికలు అక్టోబర్ 23న (గురువారం) ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు జరుగనున్నాయి. మొత్తం 292 ZPTC, 2963 MPTC ఎన్నికలకు పోలింగ్ ఉంటుంది. కౌంటింగ్, ఫలితాలు నవంబర్ 11న ప్రకటిస్తారు.







## స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌కు

# మార్గం సుగమం

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌కు మార్గం సుగమం అయింది. నోటిఫికేషన్ విడుదలపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈ క్రమంలో షెడ్యూల్ ప్రకారం రేపు యథావిధిగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానుంది. రేపు నామినేషన్ల ప్రక్రియ కూడా ప్రారంభం కానుంది.రేపు ఉదయం 10.30 గంటల నుంచి నామినేషన్‌లు స్వీకరించనున్నారు. తెలంగాణ ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మొదట ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు, ఆ తర్వాత సర్పంచ్, వార్డు సభ్యులకు ఎన్నికలు జరగనున్నాయి. ఐదు దశల్లో జరిగే ఎన్నికల ప్రక్రియ ఈ నెల 9న ప్రారంభమై నవంబర్ 11న ముగుస్తుంది.ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు 9న, సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నికలకు 17న నోటిఫికేషన్ విడుదల చేస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ప్రకటించారు.వివిధ కారణాలతో న్యాయస్థానాలు స్టే విధించిన కారణంగా 14 ఎంపీటీసీలు, 27 సర్పంచ్, 246 వార్డు స్థానాలకు ఎన్నికలను నిలిపివేసినట్లు ఎన్నికల సంఘం తెలిపింది.తొలి విడత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ రేపు ప్రారంభమవుతుంది. నామినేషన్లకు చివరి తేదీ అక్టోబర్ 11, ఆ తర్వాత రోజు నామినేషన్ల పరిశీలన, అక్టోబర్ 15న ఉపసంహరణ గడువు ఉంది. రెండో విడత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు అక్టోబర్ 13న నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. నామినేషన్లకు చివరి తేదీ అక్టోబర్ 15, మరుసటి రోజు నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ గడువు అక్టోబర్ 19.

## 20 మంది పిల్లల

# ప్రాణాలు బలిగొన్న దగ్గు!

## అన్ని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు

కలుషితమైన కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ కారణంగా సుమారు 20 మంది పిల్లలు మరణించిన తరువాత డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కఠినమైన ఆదేశాలు జారీ చేసింది. ఔషధ ఉత్పత్తుల కోసం కఠినమైన పరీక్షా ప్రోటోకాల్‌లను అమలు చేయాలని సూచించింది. ముడి పదార్థాలు, తుది ఉత్పత్తులు రెండింటినీ క్షుణ్ణంగా బ్యాచ్ పరీక్ష చేయడం, డ్రగ్స్ నిబంధనల ప్రకారం భద్రతా నిబంధనలకు కట్టుబడి ఉండటం, ఆమోదించబడిన విక్రేతల నుండి ప్రత్యేకంగా పదార్థాలను సోర్సింగ్ చేయడం అత్యవసరమని రెగ్యులేటర్ పేర్కొంది. పరిమితికి 500 రెట్లు మించి DEG చింద్వారా జిల్లాలో బాధిత పిల్లలు తీసుకున్న కోల్డ్రిఫ్ సిరప్‌లో ప్రమాదకరమైన స్థాయిలో డైథిలిన్ గ్లైకాల్ (DEG) ఉందని, దాదాపు 500 రెట్లు ఎక్కువగా ఉందని దర్యాప్తులో తేలింది. మూత్రపిండాల వైఫల్యానికి కారణమయ్యే ఈ విషం కనీసం ఆరుగురు పిల్లలను తీవ్ర అనారోగ్యానికి గురిచేసింది. నాలుగు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు ఇవ్వడానికి




అనుమతి లేనప్పటికీ, సిరప్ పెద్ద స్థాయిలో విక్రయించారు.

ప్రభుత్వ చర్య

పిల్లల మరణాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం కావడంతో మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఇద్దరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను, ఒక డిప్యూటీ డైరెక్టర్‌ను సస్పెండ్ చేసి, నిర్లక్ష్యంగా వ్యవహరించారనే అభియోగంతో రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్‌ను బదిలీ చేసింది. ప్రత్యేక దర్యాప్తు బృందం (SIT) ఏర్పాటు చేశారు. తమిళనాడుకు చెందిన దగ్గు సిరప్ తయారీదారుపై కేసు నమోదు చేశారు. అదనంగా చింద్వారా పిల్లల వైద్యుడు డాక్టర్ ప్రవీణ్ సోని అరెస్టు చేయబడ్డాడు, అతని కుటుంబ క్లినిక్‌ను సీల్ చేశారు. అయితే ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అతన్ని సమర్థించింది, మూల కారణం ఔషధ కంపెనీ లోపాలు, ఔషధ పర్యవేక్షణలో వ్యవస్థాగత బలహీనతలు అని పేర్కొంది.



# జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్

నిన్న మొన్నటి వరకు ఉత్కంఠను రేకెత్తించిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై చివరికి తెరపడింది. అధికార పార్టీగా ఉన్న కాంగ్రెస్, ఈ కీలక పోరులో విజయం సాధించేందుకు బలమైన అభ్యర్థిని రంగంలోకి దించేందుకు సమాయత్తమైంది.నవంబర్ 11న జరగనున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక అధికార కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మకంగా మారింది. సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతి నేపథ్యంలో ఈ ఉపఎన్నిక అవసరమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఈ సీటుపై ప్రత్యేక దృష్టి పెట్టారు.అభ్యర్థి ఎంపికలో పార్టీలో తీవ్ర పోటీ నెలకొనడంతో, చివరికి నిర్ణయాధికారం ఏఐసీసీకి అప్పగించారు. సర్వేలు, లోపలి చర్చల ఆధారంగా ముగ్గురు పేర్లు నవీన్ యాదవ్, బొంతు రాంమోహన్, సి.ఎన్. రెడ్డికేంద్రానికి పంపబడ్డాయి. వాటిలో చివరికి నవీన్ యాదవ్‌నే అధికారిక అభ్యర్థిగా ఖరారు చేశారు.గతంలో ఎంఐఎం తరఫున పోటీ చేసిన నవీన్ యాదవ్, ఓటమి అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పుడు ఆయనకు ఓ ఉపఎన్నికలో పోటీ చేసే అరుదైన అవకాశం దక్కింది. ఈ నియోజకవర్గంలో ఆయనకున్న అనుభవం, సామాజిక పరంగా కలిగిన బలాలు ఈ ఎంపికలో కీలక పాత్ర పోషించినట్లు సమాచారం.ఇదే సమయంలో, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఇప్పటికే తమ అభ్యర్థిని ప్రకటించింది. మాగంటి గోపినాథ్ సతీమణి సునీతను బరిలోకి దించి, సెంటిమెంట్‌ను ఓట్లకు మలచే వ్యూహంతో ముందుకెళ్లింది.ఈ నేపథ్యంలో నవంబర్ 11న జరిగే ఉపఎన్నికలో అధికారాన్ని నిలుపుకోవాలని తహతహలాడుతున్న కాంగ్రెస్, భావోద్వేగాలతో ఓటర్లు మళ్లీ తమవైపు తిప్పుకోవాలని చూస్తున్న బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ పోరు చోటుచేసుకోనుంది. ఈ ప్రతిష్టాత్మక పోరులో నవీన్ యాదవ్ ఎలా విజయం సాధిస్తారో చూడాలి.



## గ్లామర్ హద్దులు

# చెరిపేసిన కృతి శెట్టి

ఉప్పెనతో అందరి మనసులు దోచుకున్న ముద్దుగుమ్మ కృతి శెట్టి. వరస విజయాలతో ఇండస్ట్రీకి వచ్చింది ఈ బ్యూటీ. ఉప్పెన తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు లాంటి విజయాలతో అమ్మడి రేంజ్ అమాంతం పెరిగిపోయింది. కానీ ఇప్పుడు మాత్రం టాలీవుడ్ నుంచి దూరంగా వెళ్ళిపోతుంది ఈ బ్యూటీ. ఒకప్పుడు నేచురల్ లుక్, చక్కటి నటనతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చోటు సంపాదించిన ఈ భామకు.. ఇక్కడి నుంచి ఆఫర్లు రావడం తగ్గిపోయాయి. దాంతో అమ్మడు ఇప్పుడు హై రేంజ్ గ్లామర్ షోలతో సోషల్ మీడియాలో టాలెంట్ చూపిస్తుంది. అందాలు ఆరబోయడం తప్పా మరో మార్గం కనిపించడం లేదు కృతికి. అవసరం ఉన్నా లేకపోయినా, హాట్ ఫోటోషూట్స్‌తో నెటిజన్లను టార్గెట్ చేస్తోంది. తాజాగా తమిళం నుంచి కొన్ని మంచి ఆఫర్లు వస్తున్నప్పటికీ, అక్కడ పోటీ మాత్రం భీకరంగా ఉంది. రోజుకో హీరోయిన్ వస్తున్న ఈ సమయంలో రేసు జోరుగా జరుగుతుంది. ఈ నేపథ్యంలోనే కృతి గ్లామర్‌కే ప్రాధాన్యం ఇస్తూ మళ్లీ లైమ్ లైట్‌లో నిలబడాలని ప్రయత్నిస్తోంది.


సూర్య నేటి దినపత్రిక www.suryaa.com EVENING EDITION 4PM

### దేశంలో అత్యంత సంపన్న మహిళగా సావిత్రి జిందాల్..

# ఫోర్బ్స్ లిస్ట్‌లో టాప్ 10లో ఉన్న ఏకైక మహిళ

భారత్‌లో అత్యంత సంపన్న మహిళగా మరోసారి ఓపీ జిందాల్ గ్రూపు ఓనర్ సావిత్రి జిందాల్ నిలిచారు. భారత్‌లోని 100 మంది సంపన్నుల జాబితాను ఫోర్బ్స్ తాజాగా విడుదల చేసింది. ఈ జాబితాలో దేశంలోనే అత్యంత సంపన్న మహిళగా సావిత్రి జిందాల్ నిలిచారు. అంతేకాదు, టాప్ 10 భారత బిలియనీర్లలో ఉన్న ఏకైక మహిళ ఆమే కావడం విశేషం. ఫోర్బ్స్ విడుదల చేసిన జాబితాలో ముకేశ్ అంబానీ 105 బిలియన్ డాలర్లతో ఫస్ట్ ప్లేస్‌ను సొంతం చేసుకోగా, 92 బిలియన్ డాలర్లతో గౌతమ్ అదానీ రెండో స్థానంలో నిలిచారు. ఆ తర్వాత సావిత్రి జిందాల్ 40 బిలియన్ డాలర్లతో మూడోస్థానాన్ని కైవసం చేసుకున్నారు. గతేడాదితో పోలిస్తే ఆమె సంపద 3.5 బిలియన్ డాలర్లు తగ్గింది. అయినప్పటికీ భారత్‌లోనే అత్యంత సంపన్న మహిళగా సావిత్రి జిందాల్ కొనసాగుతున్నారు. భారతదేశంలోని అత్యంత సంపన్న మహిళల జాబితాలో సావిత్రి జిందాల్ పేరు అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. సావిత్రి జిందాల్.. ఓపీ జిందాల్ గ్రూపు ఓనర్‌గా ఉన్నారు. జిందాల్ గ్రూప్ భారీ వ్యాపారాన్ని ఆమె నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆమె హర్యానాలో ఎమ్మెల్యేగానూ కొనసాగుతున్నారు. స్టీల్, పవర్, సిమెట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో జిందాల్ గ్రూపు వ్యాపారాలున్నాయి. ఆ గ్రూపునకు సావిత్రి చైర్మెన్‌గా కొనసాగుతున్నారు. ఆమె భర్త ఓం ప్రకాశ్ జిందాల్ ఆ కంపెనీ స్థాపించారు. 2005లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో ఓపీ జిందాల్ ప్రాణాలు కోల్పోయారు. ఆయన మృతి తర్వాత వ్యాపారాన్ని నాలుగురు కుమారులకు విభజించారు. ముంబైలో ఉండే ఆమె కుమారుడు సజ్జన్ జిందాల్ .. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్, జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్, జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యాపారం చేస్తున్నాడు. ఎంజీ మోటారు ఇండియా ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీలో 35 శాతం వాటా తీసుకున్నారు. ఢిల్లీలో నివసించే నవీన్ జిందాల్.. జిందాల్ స్టీల్, పవర్ చూసుకుంటున్నారు.





## వరకట్న దాహానికి మరో యువత బలి

కర్ణాటకలోని బెలగావిజిల్లాలోని కమలాదిన్ని గ్రామంలో ఒక వ్యక్తి పెళ్లైన నాలుగు నెలలకే తన భార్యను హత్య చేసి, ఆమె మృతదేహాన్ని ఇంట్లో మంచం కింద దాచిపెట్టి పారిపోయిన సంఘటన వెలుగులోకి వచ్చింది. అదనపు కట్నం తీసుకుని రమ్మంటే ఆ యువతి కట్నం తీసుకురావడాన్ని వ్యతిరేకించిందని.. అందుకే భార్యను హత్య చేసి మంచం కింద దాచి పెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిందితుడు భర్త కోసం గాలింపు ముదలగి తాలూకాలోని కమలాదిన్నికి చెందిన ఆకాష్ కుంబర తన భార్య సాక్షి ఆకాష్ కుంబర (20)ను హత్య చేసి పారిపోయాడు. ఈ విషయంపై ముదలగి పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేయబడింది. పరారీలో ఉన్న భర్త ఆకాష్ కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. నాలుగు నెలల క్రితం వివాహం సాక్షికి ఆకాష్ తో నాలుగు నెలల క్రితమే వివాహం జరిగింది. పెళ్లి తర్వాత తన భార్యను పుట్టింటి ఇంటి నుంచి మరింత కట్నం తీసుకుని రమ్మనమని ఆకాష్ .. తన భార్య అయిన సాక్షిని నిత్యం వేధించే వాడని చెబుతున్నారు. మూడు రోజుల క్రితం తన భార్యని హత్య చేసి పారిపోయాడు. మహిళ హత్య జరిగినప్పటి నుంచి అతని ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉందని పోలీసు వర్గాలు చెప్పాయి. ముంబైకి వెళ్లిననిందితుడు ఆకాష్ కంబర్ తల్లి ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత ఆమెకు తన కోడలు సాక్షి మృతదేహం కనిపించింది.



## భారీ రెయిన్ అలెర్ట్

దక్షిణ ఛత్తీస్గఢ్ నుంచి తెలంగాణ రాయలసీమ అంతర్గత తమిళనాడుల మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు సగటు సముద్ర మట్టం నుంచి 0.9 కిమీ ఎత్తులో ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావం వల్ల తెలంగాణలోని 12 జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. గురువారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలలో అక్కడక్కడ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే శుక్రవారం తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలలో అక్కడక్కడ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఇక ఏపీ విషయానికొస్తే.. ద్రోణి ప్రభావంతో గురువారం ఉత్తరాంధ్ర, రాయలసీమలోని అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతిలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. మిగతా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని ప్రకటించింది.

### అత్తతో ఎఫైర్ పెట్టుకున్న అల్లుడు..

## భార్య అడ్డు చెప్పడంతో..

ఓ యువకుడు అత్త( భార్య తల్లి)తో ఎఫైర్ పెట్టుకున్నాడు. 6 నెలల పాటు ఇద్దరూ గుట్టుగా వ్యవహారం నడిపారు. ఇద్దరూ కలిసి దిగిన ఫొటోలు బయటకు రావటంతో రచ్చ మొదలైంది. చివరకు ఆ యువకుడు భార్య ప్రాణాలు తీసేశాడు. ఈ సంఘటన ఉత్తర ప్రదేశ్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. కాస్‌గంజ్ జిల్లాలోని నగ్లా పర్సీ గ్రామానికి చెందిన ప్రమోద్ అనే వ్యక్తికి శివాని అనే యువతితో కొన్ని నెలల క్రితం పెళ్లయింది. ప్రమోద్ ఎక్కువగా అత్తింట్లోనే ఉండేవాడు. ఈ నేపథ్యంలోనే అత్తా, అల్లుడి మధ్య ఎఫైర్ మొదలైంది. కొన్ని రోజుల ముందు వరకు ఈ ఎఫైర్ నాలుగు గోడల మధ్య ఉండేది. అయితే, ఇద్దరూ కలిసి దిగిన ఫొటోలు బయటకు రావటంతో రచ్చ మొదలైంది. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బంధువులు, ఇంటి పక్క ఉండేవారికి కూడా విషయం తెలిసింది. భర్త తప్పు పని చేస్తున్నాడేమోనన్న అనుమానం శివానికి ముందే వచ్చింది. భర్తను చాలా సార్లు అడిగింది. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఫొటోలు బయటకు వచ్చిన తర్వాత భార్యాభర్తల మధ్య పరిస్థితి దారుణంగా తయారయింది.రెండు రోజుల క్రితం ఇంట్లో ఎవ్వరూ లేనపుడు భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ప్రమోద్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. భార్యను కొట్టి చంపేశాడు. తర్వాత అక్కడినుంచి పారిపోయాడు. ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు రక్తపు మడుగులో పడి



ఉన్న శివానిని చూసి షాక్ అయ్యారు. ఆమె చనిపోయిందని గుర్తించాక పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు.



## 16న ఏపీ పర్యటనుకు ప్రధాని మోదీ

ఈనెల 16న ప్రధాని మోదీ ఆంధ్రప్రదేశ్ పర్యటనకు రానున్నారు. కర్నూల్, నంద్యాల జిల్లాల్లో ఆయన పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం సాయంత్రం సచివాలయంలో మంత్రులు, అధికారులు, పోలీసులతో సమీక్ష నిర్వహించారు. ఏర్పాట్లపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. పర్యటనలో ఎలాంటి అవాంచనీయ ఘటన చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయాలని సూచించారు. కాగా 16న మొదటగా కర్నూల్ జిల్లాలో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. తర్వాత శ్రీశైల క్షేత్రాన్ని సందర్శించిన మల్లికార్జున స్వామివారిని దర్శించుకోన్నారు. తర్వాత ఓర్వకల్లు మండలం నన్నూరులో నిర్వహించే బహిరంగ సభకు ప్రధాని హాజరుకానున్నారు. అలాగే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లో కలిసి ఆయన ర్యాలీలో పాల్గొననున్నారు. ఇదిలా ఉండగా అధికారులతో సమీక్షలో సీఎం కీలక సూచనలు చేశారు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రధాని పర్యటన ఏర్పాట్లను చేయాలని అధికారులకు చూసించారు. ప్రధాని పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. సభకు వచ్చే వారికి ఆహారం, తాగునీటి సౌకర్యం కల్పించాలని, ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.



## హాట్ లుక్‌లో కళ్యాణి

కళ్యాణి ప్రియదర్శన్ సౌత్ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్. 2017 నుండి సినిమాల్లో హీరోయిన్‌గా అరంగేట్రం చేసింది. 2019లో తమిళ సినిమాలో హీరోయిన్‌గా అరంగేట్రం చేసింది. నటుడు శివకార్తికేయన్ సరసన నటించి మెప్పించింది. 2020 లో మలయాళ సినిమాలో నటిగా అడుగుపెట్టిన నటి కళ్యాణి ప్రియదర్శన్ అనేక చిత్రాల్లో నటించింది. ఇప్పుడు ఆమె నటించిన లోకా చాప్టర్ 1 చిత్రం దూసుకుపోతుంది. ఇప్పటివరకు దాదాపు 200 కోట్లకు పైగా వసూల్లు రాబట్టింది.కళ్యాణి ప్రియదర్శన్ కొన్ని సంవత్సరాల క్రితం ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, శివకార్తికేయన్ తనతో నటించక ముందే తాను ఆయనకు పెద్ద అభిమానినని అన్నారు. ఈ విషయం చెప్పినప్పుడు అతను నమ్మలేకపోయాడని తెలిపింది.అతను సెట్‌లో ఉన్నప్పుడు మేము నవ్వుకునేవాళ్ళం. అతడి కామెడీ టైమింగ్ అంటే నాకు ఎంతో ఇష్టం అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం కల్యాణి చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో తెగ వైరలవుతున్నాయి.

### బీసీ రిజర్వేషన్లపై రేవంత్ డ్రామా

## బీఆర్ఎస్ ఘాటు విమర్శలు!

తెలంగాణ బీసీ రిజర్వేషన్లపై రేవంత్ రెడ్డి ఎన్నికల ముందస్తు రాజకీయ హడావుడి చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ తీవ్రంగా అభిప్రాయపడ్డారు. 'కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ బీసీల కోసం ఎన్నో హామీలు ఇచ్చింది. కానీ 22 నెలల పాటు అండర్వర్డ్‌గా ఉండి ఇప్పుడు అకస్మాత్తుగా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని హడావుడి చేస్తున్నది. చట్టబద్ధంగా ఈ హక్కులు ఇస్తామని కూడా చెప్పారు. అయితే ఆ చట్టబద్ధత ఎక్కడ ?' అని ఆయన ప్రశ్నించారు.హైకోర్టులో బీసీ రిజర్వేషన్ల కేసు విచారణ జరుగుతుండగా, తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన శ్రీనివాస్ గౌడ్ రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు జరిపారు. 'గవర్నర్ దగ్గర బిల్లు పెండింగ్‌గా ఉండగా, జీవోని ఎందుకు జారీ చేశారు ? ఇది హైకోర్టు కూడా తెలుసుకోవాలనుకుంటోంది. మహారాష్ట్ర, బీహార్ ఎన్నికల నేపథ్యంలో కులగణన, రిజర్వేషన్లు మార్గంగా వాడటం స్పష్టమైన ఎన్నికల డ్రామానే' అని ఆయన పేర్కొన్నారు.'ఎన్నికల తర్వాత కోర్టు ఈ జీవోను తప్పుడు అని చెప్పి రద్దు చేస్తే పరిస్థితి ఏంటి ? గెలిచినవారు, భారీ ఖర్చులు చేసిన వారు ఎక్కడికి పోతారు ? ఇది పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసం హైకోర్టుకు వెళ్లి హంగామా సృష్టించడం' అని తెలిపారు. 'హైకోర్టు ఆమోదిస్తే బాగుంటుంది, కానీ జడ్జి ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదు. చట్టబద్ధంగా మాత్రమే ఇవ్వాలని మేము కోరుతున్నాం' అని స్పష్టం చేశారు.'బీసీ మంత్రులు మాత్రమే హైకోర్టుకు వెళ్లడం ఏమిటి ? ఓబీసీ మంత్రులు వ్యతిరేకంగా ఉన్నారా ? రేపటి ఎన్నికల ప్రక్రియ కోసం సంతోషంగా వెళ్లతాం. ఏ సమస్య వస్తే ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి' అని అన్నారు.'బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత ఎక్కడ ? గవర్నర్ దగ్గర బిల్లు పెండింగ్‌లో ఉన్నప్పటికీ జీవో ఇచ్చారు. రాష్ట్రపతి ఆమోదం వస్తుందంటూ అసెంబ్లీలో మేము మద్దతు ఇచ్చాం. కానీ కాంగ్రెస్ పార్టీ తెలంగాణను ప్రయోగశాలగా మార్చడం మానుకోవాలి' అని ఆయన అన్నారు. 'బీసీలు, ఓబీసీల మధ్య విభేదాలు పుట్టేలా చర్యలు చేయకూడదు. కాంగ్రెస్ తమ రాజకీయ అవసరాల కోసం బీసీలను బలిపశువులు చేయడాన్ని నిలవదు. ప్రభుత్వం నిజాయితీగా వ్యవహరించాలి' అని డిమాండ్ చేశారు.

### రామన్నపేటలో విషాదం.. కంటైనర్ లారీ ఢీకొని

## హోంగార్డు మృతి



యాదాద్రి భువనగిరి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. లారీ ఢీ కొని హోంగార్డు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. రామన్నపేట మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన ఉపేందర్ చారి (36) రామన్నపేట పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే రాత్రి వాహనాల తనిఖీలో భాగంగా మండల కేంద్రంలో తెల్లవారుజామున సుభాష్ సెంటర్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో భువనగిరి నుండి చిట్యాల వైపు వెళ్తున్న కంటైనర్ లారీ అతివేగంగా ఆజాగ్రత్తగా ఆపకుండా అతనిపై నుండి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు . పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ దవఖానకు తరలించారు.